నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 20 మార్చి 2024 | www.navatelangana.com

## హరీశ్‌రావు దత్తత గ్రామంలో



- నాయిబ్రహ్మ వెంకటయ్య మృతి

**నవతెలంగాణ- గజ్వేల్**

గతంలో మాజీ మంత్రి హరీశ్‌రావు దత్తత తీసుకున్న గజ్వేల్ మండలం కొలుగూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కట్టించి ఇస్తామని చెప్పి 50 ఇండ్లను కూల్చివేయగా, వారంతా టెంట్లు వేసుకుని జీవనం గడుపుతున్నారని గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షులు బండారు మహేష్ తెలిపారు. హరీశ్‌రావు మాటలకు మోసపోయిన గ్రామానికి చెందిన నాయిబ్రహ్మ వెంకటయ్య ఈ నెల 12న చనిపోయారని ఆయన ఆరోపించారు. రెండు మూడు నెలలైనా పనులు ప్రారంభం కాకపోవడంతో వెంకటయ్య భార్యా పిల్లలు పుట్టింటికి వెళ్లిపోయినట్లు ఆయన తెలిపారు. మంగళవారం కొలుగురు గ్రామంలో బాధితులను పరామర్శించి .. వెంకటయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందించినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిజెపి నాయకులు గొడుగు రవి ,సాకలి శ్రీకాంత్, జీడిపల్లి మధు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా అమ్ముతున్న మద్యం స్వాధీనం

**నవతెలంగాణ - నార్సింగి**



కిరాణా దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా నార్సింగి పోలీసులు దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ వివరాలను మీడియాకు వెల్లడించారు. మండల పరిధిలోని భీమ్‌రావుపల్లికి చెందిన నంగునూరి సువర్ణ తన ఇంటి వద్ద కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తుంది. దుకాణం లో వచ్చే ఆదాయం సరిపోక అక్రమంగా మద్యం నిల్వ ఉంచుకుని అమ్మకాలు సాగిస్తుంది. విషయం తెలుసుకుని దాడి నిర్వహించగా దుకాణం లో నిల్వ ఉంచిన దాదాపు పదివేల విలువల గల 47 బీర్లు, 27 విస్కీ క్వార్టర్ బాటిళ్ల లభ్యము అయ్యాయని వివరించారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మెతుకు సీమలో... కరువు తీవ్రం

- జలాశయాల్లో తగ్గిన నీటి మట్టం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఇంకిపోతున్న బోరుబావులు
- ఎండుతున్న వరి పైర్లు...కాపాడుకునేందుకు రైతు తిప్పలు
- బోర్ల డ్రిల్లింగ్...బావుల తవ్వకం
- అకాల వర్షాలతో నేలవాలిన పైర్లు

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

మెతుకు సీమ ఉమ్మడి మెదక్ జిల్లాలో కరువు ఛాయలు అలుముకున్నాయి. అతివృష్టి తీవ్ర ప్రభావం తీవ్రమవుతోంది. వర్షాభావ పరిస్థితుల వల్ల జలాశయాలు, చెర్వులు, కుంటల్లో నీటి మట్టం తగ్గిపోతుంది. భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. వెరసి యాసంగి పంటలకు నీటి ఎద్దడి తలెత్తి పైర్లు ఎండుతున్నాయి. ఎండల తీవ్రత పెరిగితే సాగునీటికే కాదు తాగునీటికీ కటకట తప్పదు. పండగలా మారిన వ్యవసాయం కరువు ప్రభావంతో దండగ అవుతుండడంతో అన్నధాతలో ఆందోళన మొదలైంది. నీటి ఎద్దడితో పండలెండి నష్టపోతున్న పరిస్థితుల్లో అకాల వర్షాలొచ్చి ఉన్న పైర్లను నేలవాల్చుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల వల్ల పంట నష్టమేర్పడుతుంది. జలాశయాల నుంచి నీటిని వదిలి పంటల్ని కాపాడాలని, నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో యాసంగీ సీజన్‌లో వివిద రకాల పంటలు సాగయ్యాయి. మెదక్ జిల్లాలో వరి 260933 ఎకరాల్లో మొక్కజొన్న 2490 ఎకరాల్లో జొన్న 7899 ఎకరాల్లో శనగ 271, వేరుశనగ 99, మినుములు 11, ఇతర పంటలు 762 ఎకరాల్లో సాగయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 167120 ఎకరాల్లో వివిద పంటలేశారు. వరి 82320 ఎకరాల్లో జొన్న 54450 ఎకరాల్లో శనగ 18294, పొద్దుతిరుగుడు 3524, మొక్కజొన్న 5180, చెరకు 1075 ఎకరాల్లో వేశారు. సిద్దిపేట జిల్లాలో 354354 ఎకరాల్లో వివిద రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 3.30 లక్షల ఎకరాల్లో సాగైంది. మూడు జిల్లాల్లో కలిపి జలాశయాలు, బోరుబావుల కింద 6.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు.

### ఎండుతున్న పంటలు

కరువు పరిస్థితుల వల్ల మూడు జిల్లాల్లోనూ వరి, ఇతర పైర్లు ఎండిపోతున్నాయి. ఫిబ్రవరి నుంచి సాగునీటి ఎద్దడి ఏర్పడడంతో వరి పైర్లు ఎండిపోతున్నాయి. మార్చిలో ఎండల తీవ్రత పెరగడం, కరెంట్ కోతలు, భూగర్భ జలాలు ఇంకిపోవడంతో పైర్లు విపరీతంగా ఎండిపోతున్నాయి. సిద్దిపేట జిల్లాలో సాగునీటి జలాశయాలున్నప్పటికీ సగం మండలాల్లో పైర్లు ఎండిపోతున్నాయి. పంటలకు సాగునీటిని విడుదల చేయాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. అక్కన్నపేట, చిన్నకోడూరు, నంగునూరు, మద్దూరు, దూల్మిట్ట, చేర్యాల, కొమురవెల్లి, నారాయణరావుపేట, భూపాల్‌పల్లి, అక్బర్‌పేట, మెదక్ జిల్లాలో రామాయంపేట, నార్సింగ్, చేగుంట, నిజాంపేట, కౌడిపల్లి, సంగారెడ్డి జిల్లాలో కంగ్టి, నారాయణఖేడ్, మునిపల్లి, వట్‌పల్లి వంటి ప్రాంతాల్లో నీటి ఎద్దడి వల్ల వరి పైర్లు ఎండిపోతున్నాయి. ఇప్పటికే ఎండిపోయిన పైర్లను రైతులు గేదెలు, జీవాలకు మేపుతున్నారు. వరితో పాటు ఆరుతడి పంటలైన ఉల్లి, మొక్కజొన్న, జొన్న, శనగ వంటి పంటలు కూడా దెబ్బతింటున్నాయి.

### వట్టిపోతున్న జలాశయాలు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పలు జలాశయాల్లో నీటి మట్టం వట్టిపోతుంది. సంగారెడ్డి జిల్లాలో సింగూరు, నల్లవాగు ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గిపోతుంది. గత వర్షాకాలంలో ఏర్పడిన లోటు వర్షాపాతం వల్ల జలాశయాల్లో నీటి మట్టం తగ్గుతోంది. సింగూరు, నల్లవాగు ఆధారంగా 40 వేల ఎకరాల్లో వరి సాగైంది. మిషన్‌భగీరథ, హైదరాబాద్‌కు తాగునీరు ఇవ్వడంతో పాటు కుడికాల్వ ద్వారా సాగునీటికి నీటిని విడుదల చేయాల్సి ఉంది. కుడికాల్వ కింద 3750 ఎకరాలకు సాగునీరివ్వాల్సి ఉన్నా ఒక్క ఎకరాకు కూడా నీరివ్వట్లేదు. సిద్దిపేట జిల్లాలో పలు జలాశయాలున్నాయి. 50 టిఎంసీ సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ నీటిని వ్యవసాయానికి సాగునీరు, తాగునీరు ఇవ్వడమే కాకుండా పరిశ్రమలకు కూడా నీటి వసతి కల్పించాలి. 16.43 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా నిర్మించిన ప్రాజెక్టు నీటి ఎద్దడి వల్ల ఉనికి ప్రశ్నార్థమవుతుంది. కొండపోచమ్మ సాగర్ 15 టీఎంసీ సామర్థ్యముంది. ఐదు జిల్లాలు 10 నియోజకవర్గాలకు లబ్ధిచేకూర్చే జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. రంగనాయకసాగర్ కింద కూడా సాగునీటి కష్టాలేర్పడ్డాయి. సింగూరు, వనదుర్గ, నిజాంసాగర్, తపాస్‌పల్లి రిజర్వాయర్ల కింద లక్షలాది ఎకరాలకు సాగునీరు అందాలి. ఇవన్నీ కూడా నీటిమట్టం తగ్గుతున్నాయి.

### పడిపోతున్న భూగర్భ జలాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భూవర్భ జలాలు పడిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 82 నీటి బావులలో భూవర్ష జలాలను పరిశీలిస్తే జనవరిలో 9.71 మీటర్ల లోతులో నీటి మట్టం ఉండగా ఫిబ్రవరిలో 11.24 మీటర్లకు పడిపోయింది. మార్చిలో అది 12.30 మీటర్లకు చేరింది. అంటే ఈ రెండు నెళ్లల్లోనే 2.59 మీటర్లకు నీటి మట్టం పడిపోయింది. మెదక్ జిల్లాలో కూడా గత నెల కంటే ఈ నెలలో 2.47 మీటర్లకు నీటి మట్టం పడిపోయింది. సిద్దిపేట జిల్లాలోనూ 2 మీటర్ల వరకు నీటి మట్టం ఇంకిపోయింది. మూడు జిల్లాల్లోనూ ఫిబ్రవరిలో ఉన్న నీటి మట్టం మార్చి వరకు 2 మీటర్ల వరకు పడిపోయింది. ఏప్రిల్‌లో ఇది మరింత తగ్గి నీటి ఎద్దడి తీవ్రం కానుంది. సాగునీటికే కాదు తాగునీటికి కూడా కటకట తప్పదంటున్నారు. మిషన్ భగీరథకు నీటి విడుదల తగ్గితే గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీవ్రం కానుంది.





### పంట రక్షణకు భగీరథ ప్రయత్నం

నీటి ఎద్దడి వల్ల ఎండుతున్న పంటల్ని కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. భూగర్భ జలాలు పడిపోతుండడంతో బోరుబావులు ఆగి పోస్తున్నాయి. కరెంట్ కోత వల్ల కూడా మోటర్లు నడుస్తలేవు. బోరుమోటర్లు ఆగి ఆగి నీరు పోస్తుండడంతో రైతులు బోరును లోతు కొట్టడం కోసం డ్రిల్లింగ్ చేస్తున్నారు. బావుల్లో పూడిక తీతకు క్రేన్స్‌వాడుతున్నారు. బోరు వేయడం వల్ల రూ.40 వేల వరకు అదనపు ఖర్చు వస్తుంది. నీరు ఆగిపోయడంతో కింద పొలాలకు నీళ్లుపారట్లేదు. దీంతో రైతులు అదనంగా పైపులు వేస్తున్నారు. నీటి ట్యాంకర్ల ద్వారా పైర్లకు నీళ్ల పోసి కాపాడుకుంటున్నారు. కొన్ని చోట్ల కరెంట్ కోతల వల్ల మోటర్లు ఖాళీపోతున్నాయి. దీంతో రిపేర్ చేసి మోటర్లు బావుల్లో వేసేందుకు అదనంగా రూ.10 వేల ఖర్చు చేస్తున్నారు.

### అకాల వర్షాలతో నష్టం

నీటి ఎద్దడికి తోడు అకాల వర్షాలు తోడై పంట నష్టాన్ని పెంచుతున్నాయి. ఎండిపోగా పారుతున్న పైర్లు గాలులతో కూడిన కాల వర్షాలు కురియడంతో వరి, మొక్కజొన్న, జొన్న పైర్లు నేలవాలిపోయాయి. సంగారెడ్డి జిల్లాల్లోని న్యాల్‌కల్, ఝరాసంఘం, కంగ్టి, కల్హేర్, మునిపల్లి, నిజాంపేట, నార్సింగ్ వంటి మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పైర్లు నేలవాడమే కాకుండా మామిడి కాయలు రాలిపోయాయి. చేతికొచ్చే దశలో నీటి ఎద్దడితో పాటు అకాల వర్షాల వల్ల నష్టమేర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## ఆర్యవైశ్య సంక్షేమానికి కృషి

- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత

**నవతెలంగాణ- గజ్వేల్**



తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్య కుటుంబాలు ఆర్థికంగా రాజకీయంగా ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కాల్వ సుజాత అన్నారు. చైర్మన్‌ను మంగళవారం గజ్వేల్ మండల మైనార్టీ సెల్ కాంగ్రెస్ నాయకులు అజ్గర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఆమె చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నామినేటెడ్ పదవుల్లో సామాజిక వర్గాలకు పెద్దపీట వేసినట్టు ఆయన అన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయం 22వ వార్షికోత్సవ వేడుకలు



**నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్**

హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వర గుట్టపైగల శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం 22 వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఆలయ కమిటీ , అధ్యక్షులు ఆకుల వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, నగర పంచాయతీ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ వైస్ చైర్మన్ బొలిశెట్టి సుధాకర్ ఐలేని శంకర్ రెడ్డి, శ్రీకాంత్, సదానందం, వాల నవీన్ రావు ,మారుపాక మల్లేశం ,అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు ఉంటే నేరుగా తీసుకురావాలి

- ఎంపీడీవో గణేష్ రెడ్డి

**నవతెలంగాణ-మిరుదొడ్డి**



మిరుదొడ్డి మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో గణేష్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సమస్య, మురికి కాలువల సమస్య ఉన్నట్లయితే నేరుగా గ్రామస్తులు తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## నేడు బీజేపీ అసెంబ్లీ విస్తృతస్థాయి సమావేశం

**నవతెలంగాణ-మర్కుక్**



గజ్వేల్‌లోని పిఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం బిజెపి అసెంబ్లీ నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బిజెపి మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి అన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మెదక్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి మాదవనేని రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి హాజరు అవుతారని తెలిపారు.

## రెడ్డి కార్పొరేషన్ పదవి రెడ్డి సంఘం నేతలకే ఇవ్వాలి

**నవతెలంగాణ-సిద్దిపేట**



రెడ్డి కార్పొరేషన్ పదవి రెడ్డి సంఘాల నాయకులకు ఇవ్వాలని జిల్లా రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు వట్టిపెల్లి రాజిరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పదవి రాజకీయాలకు కాకుండా, రెడ్ల కోసం పోరాటం చేసిన రెడ్డి సంఘాల నాయకులకు మాత్రమే ఇవ్వాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. గతంలో 2018 రెడ్ల సమరభేరి సభలో అప్పుడు శాసనసభ్యులుగా ఉన్న రేవంత్ రెడ్డి పాల్గొన్నారని గుర్తు చేశారు.

## బెక్కల్ రామలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు

**నవతెలంగాణ-మద్దూరు**



దూల్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీని ఆలయ కమిటీ చైర్మెన్ చొప్పరి మల్లేశం, ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా చైర్మన్ చొప్పరి మల్లేశం మాట్లాడుతూ..రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హుండీ ఆదాయం 84 వేల 986 రూపాయలు వచ్చినట్లు ఆయన తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాలయ సిబ్బంది ఉమా పార్థివ కోటిలింగేశ్వర సేవాసమితి పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో పి విశ్వనాథ శర్మ ధర్మకర్త మండలి సభ్యులు, పోలీసులు, పాల్గొన్నారు

## 'నిర్లక్ష్యం వహిస్తే ప్రశ్నించే హక్కును కోల్పోతారు

**నవతెలంగాణ -దుబ్బాక**



ఓటుతోనే యువత భవిష్యత్తు ముడిపడి ఉంటుందని, ఓటు హక్కు ద్వారా సరైన నాయకున్ని ఎన్నుకుంటేనే సుపరిపాలన సాధ్యపడుతుందని, ఓటు హక్కు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే నాయకులను ప్రశ్నించే హక్కును కోల్పోతారని నెహ్రూ యువ కేంద్ర జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్,జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి బేతి భాస్కర్ స్పష్టం చేశారు. యువతే దేశ ప్రగతికి రథసారథులని,అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని బస్టాండ్ ఎదుట,అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలో స్వీప్ ,ఫ్లాష్ మబ్ ,నెహ్రూ యువ కేంద్ర సిద్దిపేట ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక డిప్యూటీ తహసిల్దార్ సందీప్ ఆర్ ఐ నరేందర్ ఎన్ఎస్ఎస్ అధికారులు బీ.కష్టయ్య,మధుసూదన్,వసం శ్రీనివాస్,వల్లవి,శ్రద్ధానందం,మహేందర్,రాణి,బాయికాడి లక్ష్మణ్,అధికం రాజాగౌడ్,కమ్మ శ్రీనివాస్,రాజేష్,పలువురు పాల్గొన్నారు.

## మంతూర్ నూతన బూత్ కమిటీల ఎన్నిక

**నవ తెలంగాణ-రాయపోల్**



రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలుపే లక్ష్యంగా నూతన బూత్ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని బిజెపి మండల అధ్యక్షులు రాజాగారి రాజా గౌడ్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో నూతన బూత్ కమిటీలు నియమించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో ప్రతి బూత్ కమిటీలో మెజార్టీ సాధిస్తే రఘునందన్ రావు భారీ మెజార్టీతో గెలిపించడం సాధ్యమవుతుందన్నారు. మంతూర్ బూత్ అధ్యక్షులుగా పడిగే స్వామి,కర్ల రజినీకాంత్ రెడ్డిలను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి,సీనియర్ నాయకులు కుమ్మరి కనుకయ్య,బెస్త రాములు,బాల్ రెడ్డి,ఎల్లయ్య,పాల శ్రీను, దండు చంద్రం,దూలం స్వామి,సమరేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,పడిగే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూల్యాంకన కేంద్రాలలో వసతులు కల్పించాలి

**నవతెలంగాణ-సిద్దిపేట**



మూల్యాంకన కేంద్రాలలో వసతుల కల్పన, మూల్యాంకనంలో అనుభవాన్ని పరిగణలోకి తీసుకోవడం, ఒకేషనల్ అధ్యాపకులకు వరంగల్ బదులు హైదరాబాద్‌లో క్యాంపు కేటాయించడం వంటి సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు రవి మాట్లాడుతూ గత సంవత్సరం మూల్యాంకనంలో పనిచేసి డబ్బులు క్రెడిట్ కానీ అధ్యాపకులందరికీ క్యాంపు డబ్బులు ఇవ్వాలన్నారు. మూల్యాంకన కేంద్రాల్లో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనీ, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు తదితర వసతుల కొరకు నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి నగేష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకుల నుంచి రెగ్యులర్ అధ్యాపకులుగా నియామకమైన వారి పూర్తి సర్వీసును పరిగణలోకి తీసుకోకపోవడం వలన క్రమబద్దీకరించబడిన అధ్యాపకులందరికీ అసిస్టెంట్ ఎగ్జామినర్ /స్కూటి నైజర్లగా డ్యూటీలు రావడం జరిగిందనీ, తక్కువ అనుభవం ఉన్న మోడల్ స్కూల్ టీచర్లను చీఫ్ ఎగ్జామినర్లుగా నియమించి, ఎక్కువ అనుభవం ఉన్నవారిని అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా నియామకం చేయడం సరికాదన్నారు. ఈ సంవత్సరం మూల్యాంకన కేంద్రంలో తప్పులు జరిగే అవకాశం ఉందనీ, బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తక్కువ అనుభవం ఉన్న వారిని సీఈలుగా నియామకం చేయాలని, కాంట్రాక్టు నుంచి రెగ్యులర్ అధ్యాపకులుగా నియామకమైన వారి కాంట్రాక్టు సర్వీసును కలుపుకుని మొత్తం సర్వీసును పరిగణలోకి తీసుకోక పోవడం మూలంగా సీనియర్లకు అన్యాయం జరిగిందనీ అన్నారు. జిల్లా కోశాధికారి కే రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఒకేషనల్ అధ్యాపకులు గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌కి వెళ్లారని, ఈ సంవత్సరం వరంగల్ క్యాంప్ ఇవ్వడం వలన ఇబ్బందులు పడతారని, హైదరాబాదులో అవకాశం కల్పించాలని కోరారు. గెస్ట్, ప్రైవేట్ అధ్యాపకులకు 10 నెలల వేతనం మాత్రమే వస్తుందనీ, వారిని మూల్యాంకనం కోసం 60 నుంచి 100 కిలోమీటర్ల దూరం నుంచి రప్పించడం జరుగుతుందనీ, వారికి బోజన, వసతి సౌకర్యాలలో తీవ్ర ఇబ్బంది కలుగుతుందనీ అన్నారు. క్యాంపు పూర్తి అయిన వెంటనే వారికి మూల్యాంకన డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ , భీమ్రావు , సదానందం మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మి, స్వప్న, జిల్లా ఉపాధ్యక్షులు కే యాదగిరి , గోపాల్, శ్రీకాంత్, లక్ష్మీ ప్రసాద్ వేణుగోపాల్, రాజా రమణ, మధు ,వెంకటరమణ మెదక్ జిల్లా నాయకులు వేణుగోపాల్ , శ్రీకాంత్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు రూ.10 వేల పరిహారమివ్వాలి

- ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయండి
- విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయ, ఆర్టికల్చర్ అధికారులతో మాట్లాడుతూ మాజీ మంత్రి,
- ఎమ్మెల్యే హరీశ్ రావు





**నవతెలంగాణ-సిద్దిపేట**



అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రతి ఎకరాకు ప్రభుత్వం రూ 10 వేల నష్టపరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం కురిసిన అకాల రాళ్ల వర్షంతో నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని తెలుసుకోవడం కోసం ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే మాట్లాడుతూ బుడగ జంగాల కాలనీలో స్తంభాలు విరిగిపడి ఆటో ధ్వంసంమైందని, చెట్లు విరిగిపోయాయని తెలిపారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డులో వెల్డింగ్ షాప్ షెడ్ ఎగిరిపోయిందని, నాసరపురలో ఇండ్లు కూలిపోయాయని, చెట్లు విరిగిపోయాయన్నారు. లింగారెడ్డిపల్లి రోడ్డులో పంటలకు నష్టం జరిగిందని, పట్టణంలో రాళ్ల వానతో చెట్లు విరిగిపడ్డాయని, బూరుగుపల్లి వద్ద తాడిచెట్టు విరిగిపడడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయిన్నట్లు, నంగునూరు మండలంలో మామిడి తోటలకు బాగా నష్టం జరిగిందని, చిన్నకోడూరు మండలంలో గొర్రెల షెడ్డు రేకులు ఎగిరిపోయాయని, చిన్నకోడూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో లారీలో లోడ్ చేసిన పొద్దు తిరుగుడు బస్తాలు తడిచిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి సమయంలోనే ప్రజలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. ఆపత్కాల సమయంలోనే ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజలకు అండగా ఉండాలన్నారు. అన్ని మండలాలలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు ఒక బృందంగా ఏర్పడి ఉదయం 6 గంటలకే వ్యవసాయ పొలాలను పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పంట నష్టాన్ని అధికారులకు చూపించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులకు వెంటనే విరిగిన స్తంభాలను మరమ్మతులు చేయాలన్నారు. ఎన్ని ఇండ్లు నష్టపోయాయో రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో తిరగండి. విద్యుత్, రెవెన్యూ , వ్యవసాయ శాఖ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటా అని ఎమ్మెల్యే టెలికాన్ఫరెన్స్ లో తెలిపారు.

## పట్టణానికి సద్గురు మహాదేవ్ స్వామీజీ మహా పాదయాత్ర



**నవతెలంగాణ-సిద్దిపే:** శ్రీశ్రీశ్రీ ఆది జగద్గురు రేణుక ఆచార్య జయంతి సందర్భంగా సద్గురు మహాదేవ్ స్వామీజీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సిద్దిపేటకు చేరుకుందని పట్టణ గౌరవ అధ్యక్షులు నరుకుల్ల శివప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా గుడిమెట్ నుండి యాదాద్రి జిల్లా కొలనుపాక వరకు మహా పాదయాత్ర సిద్దిపేటకు రాగా, వీరశైవ లింగ బలిజ సమాజం ఆధ్వర్యంలో కోటిలింగాల దేవస్థానంలో వారికి అన్న ప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సద్గురు మహాదేవ్ స్వామీజీ ప్రవచనలు, సిద్ధాంత శిఖామణి గురించి వివరించడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేటజిల్లా గౌరవ అధ్యక్షులు ఆకుల భద్రప్ప, జిల్లా అధ్యక్షులు ఆకుల ప్రశాంత్, పట్టణ అధ్యక్షులు బావుపల్లి యాదగిరి, మాజీ అధ్యక్షులు అనుముల మల్లేశం, పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

**నవతెలంగాణ-కొండపాక**





ఆన్‌లైన్ గేమ్స్‌తో చేసిన అప్పులు తీర్చలేక జీవితం పై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట పట్టణానికి చెందిన మద్దెల పవన్ కళ్యాణ్ (26) మంగళవారం తెల్లవారుజామున కొండపాక మండలం వేలికట్ట గ్రామ శివారులో బాలాజీ కాటన్ మిల్లు సమీపాన రైల్వే ట్రాక్ దగ్గర ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పరిసర ప్రాంత ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దిపేటకు చెందిన పవన్ కళ్యాణ్ జగదేవ్ పూర్ లో ఎం ఎస్ ఎన్ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 16న డ్యూటీకి వెళుతున్నాను అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఫోన్ చేసినప్పటికీ స్విచ్ ఆఫ్ వచ్చింది. అతని ఆచూకీ కోసం బంధువుల వద్ద, స్నేహితుల వద్ద కంపెనీలో ఆరా తీశారు. ఆత్మహత్య విషయం మంగళవారం ఉదయం పోలీసులు కుటుంబీకులకు తెలపడంతో వెళ్లి చూశారు. ఆన్‌లైన్ గేముల మోజులో పడి అప్పుల చేశాడు. వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి పరమేష్ ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా కష్ణగౌడ్

**నవతెలంగాణ-రాయపోల్**



బిజెపి పార్టీ నూతన మండల ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి గ్రామానికి చెందిన చుంచనకోట కృష్ణ గౌడ్ ను నియమిస్తున్నట్లు దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్ రావు తెలిపారు. మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. కృష్ణ గౌడ్ మాట్లాడుతూ రాయపోల్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావుకి, బిజెపి మండల అధ్యక్షులు రాజా గౌడ్, మాజీ అధ్యక్షులు వెంకట గౌడ్ ఎన్నికకు సహకరించిన ఇతర నాయకులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు రాజా గౌడ్, మండల మాజీ అధ్యక్షులు వెంకట్ గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షులు మంకిడి స్వామి, సీనియర్ నాయకులు వెంకట్ గౌడ్, నరేష్ గౌడ్, స్వామి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివసేనారెడ్డిని చైర్మన్‌గా నియమించడం పట్ల హర్షం

**నవతెలంగాణ -నంగునూరు**



తెలంగాణ రాష్ట్ర క్రీడల శాఖ చైర్మన్‌గా కొత్తకాపు శివసేనారెడ్డి నియామకం పట్ల యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు. మంగళవారం నంగునూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వనపర్తి జిల్లా పెద్దగూడేనికి చెందిన కొత్తకాపు శివసేనారెడ్డికీ అభినందనలు తెలియజేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డిని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ గా నియ మిం చడం చాలా సంతోషకరమని తెలిపారు.

## ఎగిరిపడ్డ రేకులు తడిసిన కలప

**నవతెలంగాణ-నిజాంపేట్**





మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో నిన్నటి రాత్రి కురిసిన వడగాళ్ల వాన కు

శ్రీ సాయి వుడ్ ఫర్నిచర్ వర్క్ షాపు యొక్క రేకులు గాలికి ఎగిరి పక్కనే ఉన్న పంట పొలంలోకి ఎగిరిపడ్డాయి. వివరాల్లోకి వెళితే నందగోకులం గ్రామానికి చెందిన వడ్ల నరసింహులు నస్కల్ గ్రామంలో పెట్రోల్ పంపు సమీపంలో రేకుల షెడ్డుతో నిర్మాణం చేసుకొని ఇళ్లకు కావాల్సిన కిటికీలు డోర్లు వివిధ ఫర్నిచర్ సంబంధించిన పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాలక్రమేనా సోమవారం నాడు కురిసిన బీభత్సమైన గాలివానకు తన ఉపాధికి నిలయమైన రేకుల షెడ్డు మొత్తం రేకులు గాలిలో ఎగిరి పోయి పక్కనే ఉన్న పంట పొలాల్లో పడ్డాయని, షాప్ లో ఉన్న కలప మెటీరియల్ వానకు తడిసి పోయినాయి. గాలి వాన చేసిన బీభత్సవానికి తనకున్న ఈ ఉపాధి కోల్పోయానని దాదాపు 45 నుంచి 50 వేల రూపాయల నష్టం వాటిల్లిందని మళ్లీ నిర్మాణం చేసుకోవాలంటే మరొక 50 వేల రూపాయలు ఖర్చు అవుతుందని గుండెలు బాగున్నాడు.ఈ అకాల వర్షానికి తన ఉపాధి కోల్పోయి రోడ్డున పడే అవకాశం ఉంది కాబట్టి ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షకార్యదర్శులుగా విట్టల్, శంకర్



**నవతెలంగాణ-రాయికోడ్**

రాయికోడ్ మండలం ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షకార్యదర్శులుగా ఒగ్గు.విట్టల్, కొల్లూరు శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎన్.పండరి, వై.ప్రశాంత్ సహాయ కార్యదర్శిగా శెట్కార్, సాయిరాం, కోశాధికారిగా విఠల్‌రావ్ కులకర్ణి, గౌరవ అధ్యక్షులుగా కే.పెంటయ్య, సలహాదారులుగా టీ.రాములు, జి.గోపాల్, కార్యవర్గ సభ్యులుగా హనుమంతు, రాజ్ కుమార్, బాబురావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి చేరవేయడంలో పత్రికా రంగం ముందుంటుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో పిల్లర్ అయిన జర్నలిజం మీడియా రంగంలో పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తేవడమే తమ బాధ్యతన్నారు.

## యువకుడి అదృశ్యం..



- ఆచూకీ తెలిపితే రూ.50 వేల బహుమతి

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

బొల్లారానికి చెందిన కొత్తగళ్ల లవన్ కుమార్ అనే యువకుడు ఈనెల 11న డ్యూటీ నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దాంతో అతడి కుటుంబ సభ్యులు బంధువల దగ్గర, తెలిసిన వాళ్ల దగ్గర ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. ఎవరికైనా అతడి ఆచూకీ తెలిస్తే చెప్పాలని.. వారికి రూ.50వేల బహుమతి ఇస్తామని యువకుడి తండ్రి గంగాధర తెలిపారు. సమాచారం తెలిస్తే 91 9848473320కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు.

# ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత మల్లు స్వరాజ్యం

- ఆమె స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం

**నవతెలంగాణ-సంగారెడ్డి**

ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాత వీరనారి మల్లు స్వరాజ్యం అని.. ఆమె స్ఫూర్తితో ఉద్యమాలు చేద్దామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. మంగళవారం మల్లు స్వరాజ్యం 2వ వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను దృఢంగా నమ్మి 16 ఏండ్ల వయస్సులో ఉద్యమంలోకి వచ్చారని గుర్తు చేశారు. తెలంగాణలో భూమి, భుక్తి, వెట్టిచాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ఆమె పాల్గొన్నారన్నారు. తర్వాత గెరిల్లా పోరాటంలో మహిళలను చేర్చుకోవడం, వారికి శిక్షణ ఇవ్వడంలో ఆమె కీలకపాత్ర పోషించారని కొనియాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సమస్యలపై తనదైన శైలిలో వాదన వినిపించారన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఆమె పోరాట స్ఫూర్తితో నేటి యువత, మహిళలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, నాయకులు నర్సింహులు, అశోక్, కృష్ణ, శివ, బాబురావు, శ్రీను పాల్గొన్నారు.

**సదాశివపేట :** స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నైజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్రభాగాన నిలిచి పోరాడిన యోధురాలు మల్లు స్వరాజ్యం అన్నారు. మల్లు స్వరాజ్యంను పట్టిస్తే నైజాం నవాబు పదివేల రూపాయలు బహుమతిగా ఇస్తానని 1948లో నిజాం నవాబు ప్రకటించారని.. దీని ద్వారా నిజాంలపై మల్లు స్వరాజ్యం ఎలాంటి పోరాటం చేసిందో అర్థమవుతున్నదన్నారు. కాబట్టి స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్ సంజీవులు మైపాల్, మాణిక్యం, నర్సింలు, దశరథ్ పాల్గొన్నారు.

**నారాయణఖేడ్‌రూరల్ :** స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఏరియా కమిటీ సభ్యులు మోషప్ప మాట్లాడుతూ.. తెలంగాణలో భూమి, భుక్తి, వెట్టిచాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో మల్లు స్వరాజ్యం పాల్గొన్నారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పుడు.. శాసనసభలో ఆమె అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వాలు సైతం భయపడేవి అన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ్, అభిషేక్ కిరణ్ రాహుల్ పవన్ పాల్గొన్నారు

**పుల్కల్ :** చౌటకూర్ మండలంలోని సీబీఎల్ బీరు పరిశ్రమ వద్ద కామ్రేడ్ మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బాగా రెడ్డి హాజరై మాట్లాడుతూ.. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరుగని పోరాటలు చేసిన వీర వనిత కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అన్నారు. రాష్ట్రంలో మూడు వేల గ్రామ స్వరాజ్యాలను ఏర్పాటు చేసి 10 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచి పెట్టిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఆమె ఆశయాలను సాధించడం కోసంఐక్యంగా నిలబడి పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ప్రసన్న రావు, నాయకులు సత్యనారాయణ దేవరాజ్, ప్రభాకర్, యాదగిరి, నాగభూషణం, మల్లారెడ్డి, చంద్రయ్య, సురేష్ పాల్గొన్నారు.








## నూతన మండలాభివృద్ధి కార్యాలయాన్ని ప్రారంభించాలి





**నవతెలంగాణ-గుమ్మడిదల**

మండల కేంద్రంలో అంగు ఆర్భాటాలతో నిర్మిస్తున్న మండల అభివృద్ధి కార్యాలయాన్ని త్వరగా పూర్తి చేసి.. వెంటనే ప్రారంభించాలని మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మండలానికి సంబంధించి.. ఎందరో పోలీస్ ఉన్నతాధికారులు మారుతున్నప్పటికీ పోలీస్ స్టేషన్ నిర్మాణం పనులు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. స్థల పరిశీలన చేసి.. పారిశ్రామిక నేతల సహకారంతో త్వరలోనే పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారే తప్పా.. ఆచరణలో మాత్రం జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించడానికి సంబంధిత ప్రణాళిక రూపొందించి వెంటనే నిర్మాణం పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు



**నవతెలంగాణ-న్యాల్‌కల్**

మండలంలో రెండ్రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలులకు చేతికొచ్చిన పంట నేలకొరిగింది. దాంతో మండలంలోని హద్నూర్, గుంజేటి, ముంగి, మిర్జాపూర్ (ఎన్), రుక్మాపూర్ ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సంబంధిత అధికారులు మంగళవారం పరిశీలించారు. మామిడి చెట్లు, జొన్న పంటల్లో దెబ్బతిన్న వాటి వివరాలను సేకరించినట్టు వ్యవసాయ ఏఈవో సాయిలు, షరీఫ్ తెలిపారు. మండలంలో 133 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం జరిగిందని..అందుకు సంబంధించి ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి నివేదిస్తామని అగ్రికల్చర్ ఆఫీసర్ ఇన్చార్జ్ శైలజ చెప్పారు.

## పార్టీ గేట్లు కాదు.. ఇచ్చిన హామీ గేట్లు తెరవండి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**నవతెలంగాణ-సంగారెడ్డి**

'సీఎం రేవంత్‌రెడ్డి తమ పార్టీ గేట్లు ఎత్తితే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని అంటున్నారు' అని పార్టీ గేట్లు ఎత్తడం కాదు, ప్రజలకిచ్చిన హామీల గేట్లు తెరవండి అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతల ప్రభాకర్ ఎద్దేవా చేశారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సహాయం చేస్తామన్న ఆ గేటు ఎత్తండి అని అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15,000 చొప్పున ఇస్తామన్న ఆ హామీ గేటు ఎత్తండి అంటూ విమర్శించారు. కౌలు రైతులకు రూ. 12 వేలు,వరికి రూ.500 బోనస్, అర్హులైన ప్రతి ఒక్కరికి నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామన్నారు ముందుగా వాటన్నింటి గేట్లు ఎత్తండి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే, రైతులకు ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగులకు డీఏ లేదు.. నిరుద్యోగ భృతి లేదని ముందు ఆ గేట్లు ఎత్తండి అన్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ నాయక్, వెంకటేశ్వర్లు, కసిని శ్రీకాంత్, విట్టల్, కుమార్ పాల్గొన్నారు.

## మొదటిరోజు ఆబ్సెంట్.. రెండోరోజు అటెండ్

- తీవ్ర అనారోగ్యంతో పరీక్షకు గైర్హాజరైన విద్యార్థినికి ఎంఈఓ కౌన్సిలింగ్
- దాంతో రెండోరోజు హిందీ పరీక్షకు హాజరు



**నవతెలంగాణ-పుల్కల్**

తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ పదో తరగతి విద్యార్థిని మండల విద్యాధికారి చొరవతో మంగళవారం హిందీ పరీక్ష రాసింది. మొదటిరోజు పరీక్షకు హాజరుకాకపోవడంతో.. ఎంఈఓ స్వయంగా ఆ విద్యార్థిని దగ్గరికి వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వడంతో రెండోరోజు పరీక్షకు హాజరైంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

పుల్కల్ మండల పరిధిలోని లాల్‌సింగ్‌నాయక్‌తాండాకు చెందిన నవనీత మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్నది. ఆమె తండ్రి మూడేండ్ల క్రితమే మృతి చెందగా.. చదువు మీద ఉన్న ఆసక్తితో విద్యను కొనసాగిస్తున్నది. అయితే ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాగా.. నవనీత ఇటీవలే తీవ్ర అనారోగ్యానికి గురైంది. దాంతో మొదటిరోజు పరీక్షకు హాజరుకాలేదు. ఈ విషయం తెల్సుకున్న మండల విద్యాధికారి అంజయ్య సోమవారం రాత్రి ఆ విద్యార్థిని ఊరికి వెళ్లగా.. అక్కడ వారు లేరని తెలిసింది. చివరకు పోలీసులు, పంచాయతీ రాజ్ సాయంతో ఆరా తీయగా.. కంది మండలంలోని మామిడిపల్లి గ్రామతాండాలో ఉన్నట్టు తెలిసింది. హుటాహుటినా అక్కడికి వెళ్లి నవనీతతో పాటు ఆమె తల్లికి ఎంఈఓ కౌన్సిలింగ్ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు అంబులెన్స్ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతేకాకుండా విద్యా ప్రాముఖ్యత.. అందులోనూ గిరిజన బాలికలకు విద్య ఎంత అవసరమో వారికి వివరించారు. దాంతో ఆ విద్యార్థిని పరీక్ష రాయడానికి సిద్ధమై.. రెండోరోజు హిందీ పరీక్షకు హాజరైంది. కాగా ఇందుకు సహకరించిన పుల్కల్ ఎస్.సి గొంగులూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు రేణుక, లాల్‌సింగ్‌నాయక్‌తాండా ప్రధానోపాధ్యాయులు గోపి, కంది మండలం విద్యాధికారి వెంకట నరసింహులు, గొంగులూరు మాజీ సర్పంచ్, అంగన్వాడి టీచర్, గ్రామ కార్యదర్శి, కంది మండల సిఆర్పి అశోక్, పుల్కల్ సిఆర్పి మల్లేశం, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం సుభాష్ సింగ్‌లకు ఎంఈఓ అంజయ్య ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్**

నారాయణఖేడ్ నియోజకవర్గం పరిధిలోని పెద్దశంకరంపేట మండలానికి చెందిన కొత్తపెట్, సంగారెడ్డిపేట, నారాయణఖేడ్ మండల పరిధిలోని సత్యగామ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్‌కు సంబంధించిన 250 కుటుంబాలు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కొత్తపెట్ మాజీ తాజా సర్పంచ్ అనంతరావు, కొంపల్లి శ్రీశైలం, వార్డు సభ్యులు సంగయ్య, దత్తు, అంజయ్య, మాజీ సర్పంచ్ ఆగమయ్య, సాయిలుతోపాటు పలువురు ఉన్నారు. ఈ చేరిక కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ పిఏసిఎస్ చైర్మన్ శోభ అశోక్ రెడ్డి, మాజీ ఎంపిటిసి పండ రి రెడ్డి, యాదవ రావు, రాములు, గోపాల్ రెడ్డి, బోజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు, పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధుసూదన్ పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన అందోలు బీఆర్ఎస్ నాయకులు



**నవతెలంగాణ-జోగిపేట:** జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బీబీ. పాటిల్ సమక్షంలో అందోల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బీజేపీలో చేరారు. హైద్రాబాద్‌లోని ఎంపీ బీబీపాటిల్ క్యాంపు కార్యాలయంలో నియోజకరవ్గ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రమేశ్ బస్వరాజ్ (పుల్కల్), బ్రహ్మం (అల్లా దుర్గం), అరవింద్‌రెడ్డి (రేగోడ్), మునిపల్లీ మండల సీనియర్ నాయకులు బసవరాజు , రామ కష్ణ, చౌటకూర్ మండల నాయకులు రాజ్ కుమార్‌లతో పాటు వివిధ మండలా లకు చెందిన రాజశేఖర్ రెడ్డి, నర్సింలు, వివేక్ వర్ధన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి తదితరులు బీజేపీలో చేరారు. వారికి పాటిల్ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ రమేష్

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష తీరును పరిశీలించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సరైన వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మేలు చేసిన వర్షం

నవతెలంగాణ-నార్సింగి



ఎండా కాలం తొలినాళ్లలోనే ఎండలు తీవ్రంగా మండుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి వ్యవసాయ బోర్లలో నీళ్ళు రాక, పంటలు ఎండీ రైతులకు కంట తడి పెట్టిస్తున్నాయి. దిక్కు తోచని స్థితిలో ఉన్న వరి రైతులకు సోమవారం రాత్రి మండలంలో కురిసిన వర్షం మేలు చేసిందని మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి తెలిపారు. మండలం లో నీటి నిల్వల అంచనాలకు అనుగుణంగా ఇక్కడి వరి రైతులు నాట్లు ఆలస్యంగా వేశారని, అదే వారికి మేలు చేసిందని తెలిపారు. సామాన్యంగా ఇది వరి ఈనే సమయం అని, నాట్లు ఆలస్యం చేయడం వల్ల వరి ఈనే దశకు చేరుకోలేదని అన్నారు. మండలంలో వర్షం కురిసిందని, వడగళ్ల వాన పడి ఉంటే పంటలకు చాలా నష్టం వాటిల్లేదని, వరి యేతర పంటలకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. మొత్తం మీద సోమవారం కురిసిన వర్షానికి మండల రైతులకు మంచే జరిగిందని యాదగిరి అన్నారు.

## వడగండ్ల వాన బీభత్సం

- నేల రాలిన మామిడికాయలు
- లబోదిబో మంటున్న మామిడికాయల వ్యాపారస్తులు
- విద్యుత్ సరఫరాకు బ్రేక్

నవతెలంగాణ -వెల్దుర్తి



వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది, పగలంతా ఎండ వేడిమి తట్టుకోలేక సాయంత్రం వరకు విలవిలలాడిన జనాలు ఉన్నట్టుండి కారు మబ్బులు కమ్మి గాలి దుమారంతో పాటు వడగండ్ల వాన సోమవారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. మామిడి తోటను లక్షలు వెచ్చించి లీజుకు తీసుకొని కాయలు పండిన అనంతరం విక్రయించి సొమ్ము చేసుకుందామని ఆలోచనలో ఉన్న ముస్లిం సోదరులు కాసిం, హకీమ్, అనే వ్యక్తులు మంగళవారం ఉదయం చూసేసారికి కాయ మొత్తం రాలి నేలపై ఉండడంతో చూసి బోరన పిలిపించసగారు మామిడి తోట యజమానులు మమ్ముల కరుణించి ఆదుకోవాలని కోరారు. రాత్రంతా విద్యుత్ సరఫరా లేక గ్రామమంతా అంధకారంలో ఉంది. కొన్ని చోట్ల కోత దశలో ఉన్న వరి చేనులు నేలకొరిగాయి. రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. ఇటుక బట్టీల వద్ద పచ్చి ఇటికే వానకు తడిసి మట్టిముద్దలై లక్షలలో ఇటుక బట్టీల యజమానులకు నష్టం వాటిల్లింది. డ్రైనేజీలు నిండి రోడ్లపైకి మురికి నీర చేరాయి. మడికట్లలో భారీగా నీరు చేరాయి, పగలంతా ఎండ వేడిమి సాయంత్రం వేళ వాన ఇదేమిటి అనుకుంటే ప్రకృతి ఎప్పుడు ఎలా ఉంటుందో ఎవరికి ఎరుక అని జనాలు అనుకుంటున్నారు. భారీగా నష్టం జరిగిన కొంత మేర చల్లదనమైందని మరికొందరు అంటున్నారు

## గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

- ఐసిడిఎస్ సూపర్వైజర్ షైనీ

నవతెలంగాణ-చేగుంట



గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు మంచి పౌష్టిక ఆహార పదార్థాలు తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ షైనీ సువర్ణ అన్నారు. చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జిఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, కిశోర బాలికలకు,పోషన్ కిట్లు, జిఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీ, బాలంతా, కిషోర్ బాలికలు, గ్రామంలో అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలను వినియోగించుకోవడం, ఎక్కువ శాతం పోషక ఆహార పదార్థాలను తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ బాలలక్ష్మి, ఉమాదేవి, సురేఖ, పాల్గొన్నారు.

## 5 తరగతులు ఒకే టీచర్....?

- ఐసిడిఎస్ లిమా పాఠశాలకు ఉపాధ్యాయున్ని కేటాయించండి గ్రామస్తులు....

నవతెలంగాణ చిలిపిచేడ్



మండల పరిధిలోని గన్య తాండ ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులకు ఒకే టీచర్ బోధించడం పట్ల తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1 నుండి 5వ తరగతి వరకు 34 మంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. 5 తరగతులకు ఒకే టీచర్ ఉండడం గమనార్హమనీ గ్రామస్తులు లబోదిబోమంటున్నారు. అన్ని తరగతులకు ఒకే టీచర్ బోధించడం సాధ్యం కాదని విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని గన్యాతాండ గ్రామాన్ని నిరుపేద పిల్లలను చులకనగా చూస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. మా పాఠశాల సమస్యను ఉన్నతాధికారులు స్పందించి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సజావుగా పది పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 23 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



మెదక్ జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని 68 పరీక్షా కేంద్రాలలో మంగళవారం రెండో రోజు 10298 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 10275 మంది విద్యార్థులు హాజరయ్యారు. మిగితా 23 విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి. రాదాకిషన్ తెలిపారు. పరీక్షల కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి తనిఖీ చేశారు. పరీక్షల తీరును, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా కొనసాగుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ కవిత అరెస్టు ఓ హై డ్రామా

నవతెలంగాణ- చేగుంట



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు ఓ పెద్ద నాటకమని, చేగుంట మండలం చందాయిపేట మాజీ సర్పంచ్ స్వర్ణలత, కాంగ్రెస్ జిల్లా నాయకులు భాగ్యరాజ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తండ్రి కేసీఆర్ ఇప్పటివరకు రియాక్ట్ కాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. అలాగే ప్రధాని మోదీ సైతం దీనిపై స్పందించకపోవడం దీని వెనుక పెద్ద హై డ్రామా ఉందని, కెసిఆర్ ,మోడి రెండు పార్టీలు ఒకటే నని, పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఇద్దరు కలిసి చీఫ్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. దీనిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో రెండు పార్టీలకు తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్తారని, తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క సారథ్యంలో 17 పార్లమెంట్ స్థానాలకు17 కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## మృతి చెందిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆదుకోవాలి

- గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్



నవతెలంగాణ-కౌడిపల్లి

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం జాజితాండలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులకు ఇంటి పైకప్పు రేకులతోపాటు మూడేళ్ల చిన్నారి మాలోత్ సంగీత ఎగిరిపడి మృతి చెందిన విషయం వితమే. ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్ మంగళవారం జాజి తండాకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన చిన్నారి తల్లిదండ్రులు కూలి నాలి చేస్తూ జీవనం సాగిస్తున్నారు చిన్నారి సంగీత కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వారి కుటుంబానికి ప్రభుత్వపరంగా ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు శివాజీ నాయక్, స్థానిక మాజీ సర్పంచ్ రమేష్, వల్యా నాయక్, మహేష్ నాయక్, రాజు, అకేష్,గోపి,పాండు, గేమ్యా నాయక్ సూర్య, శీను, పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ కళాశాల పనితీరు ఆదర్శనీయం

- కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్



సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల పనితీరు ఆదర్శనీయమని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని పిల్లికోటల్ వద్ద గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వహణ పనితీరు, కోర్సుల వివరాలు, గతంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తదితర వివరాల గూర్చి వైస్ ప్రిన్సిపల్ సబిత ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కళాశాలలో 665 మంది విద్యార్థినులు వివిధ కోర్సులలో విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. అనుభవిజ్ఞులైన ఫ్యాకల్టీల ద్వారా ఉత్తమ విద్యా బోధన అందిస్తూ విద్యా నైపుణ్యాలను మెరుగుపరిచి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సబితా, డాక్టర్ పిసి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయమైన విద్య కోసం ఎస్ఎఫ్ఐ పోరాటాలు

- జిల్లాలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలి
- ఏప్రిల్ 3, 4 తేదీల్లో ఎస్ఎఫ్ఐ 27వ జిల్లా మహా సభలు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్

నవతెలంగాణ-మెదక్



నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పాఠ్య పుస్తకాలలో స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలను, శాస్త్రీయమైన దృక్పథంలాంటివి చేర్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ కేవల్ కిషన్ భవనంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు పగడ్బందీగా జరగాలని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష కేంద్రాల పై దృష్టి సారించాలన్నారు. పరీక్ష పేపర్లు లీకేజీలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థుల పరీక్షల సమయానికి బస్సులు నడిపించాలన్నారు. వేసవికాలం కావున ప్రభుత్వ పాఠశాలలో నీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో నీటి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్లో నెలకొన్న పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, కేజీబీవి హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పై పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా 27వ మహా సభలు ఏప్రిల్ 3,4 తేదీలలో జిల్లా కేంద్రంలో జరుగుతాయని విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, సహాయ కార్యదర్శి అజయ్, జగన్, నాయకులు సత్యం పాల్గొన్నారు.

## పట్టణ కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన పోలీసులు

నవతెలంగాణ - నార్సింగి



జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరగడానికి మండల కేంద్రం లో పోలీసులు కవాతు నిర్వహించారు. రామాయంపేట సీఐ వెంకటేష్, నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ ల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది తో పట్టణం లోని పలు వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజలు ఎవ్వరికి భయపడకుండా ప్రజలకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించడం జరిగిందని అన్నారు. పార్లిమెంట్ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రలోభాలకు లోనై ఓట్లు అమ్ముకోకూడదని, ఎవరైనా భయభ్రాంతులకు గురి చేసినా, మద్యం నిల్వ ఉంచినా, డబ్బులు పంపిణీ చేసినా తమకు సమాచారం అందించాలని, వారి పై వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచ బడతాయని అన్నారు.

## అసైన్డ్ భూముల్లో అక్రమ పేలుళ్లు

నవతెలంగాణ- టెక్మాల్



అసైన్డ్ భూముల్లో అక్రమ పేలుళ్లు పేలుస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న సంఘటన మండల పరిధిలోని సధనురా గ్రామ శివారులో సర్వేనెంబర్ 573 లో నాలుగు ఎకరాల 13 గుంటలు కొనుగోలు చేశారు. అక్రమంగా ఓ ప్రభుత్వ ఉద్యోగి తన పలుకుబడిని ఉపయోగించుకొని, చట్టాల్లో ఉన్న రుసువులను ఆసరాగా చేసుకొని తన అక్రమ దందాను యతేయచ్ఛగా కొనసాగిస్తున్నారు. అసైన్డ్ భూములు ధనురా రోడ్డుకు జోగిపేటకు వెళ్లే రహదారిలో విలువైన ప్రాంతంలో ఉండడం చేత వ్యాపారవేత్తలు రియల్ ఎస్టేట్ వర్గాలు ఆ భూములపై కన్నేసాయి, తక్కువ ధరకు కొనుగోలు చేసి పెద్ద మొత్తంలో లాభాలు గడించాలని ఆలోచనతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఈ ముగ్గులపై పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు రాబట్టే విధంగా చూస్తున్నారు. గతంలో టేక్మాల్ తసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అప్పట్లో ఈ భూమిని కొనుగోలు చేశారు. అసైన్డ్ భూమి పట్టాలు కావని తెలుసుకున్న కొనుగోలు చేశారు అంటే అర్థమేమిటి, ఈ భూమి కొనుగోలు చేసేందుకు తాసిల్దార్ కార్యాలయంలోనే కొంతమంది తనకు సహకరిస్తున్నారని సన్నిహితుల వద్ద తెలిపారు. ఇక్కడి నుండి ట్రాన్స్ఫర్ అయిన తర్వాత ఆ అసైన్డ్ భూములలో పనులు చేపట్టి, మట్టి దిబ్బలను బండరాలను తొలగించేందుకు పెద్ద మొత్తంలో ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలు చేస్తే గ్రామస్తులు సదరు ఉద్యోగస్తుల్ని నిలదీయడంతో ఊరుకున్నారు. ప్రస్తుతము బండరాళ్లకు కన్నాలు వేస్తూ వాటిలో జిలేటిన్ స్టిక్స్ పెట్టి పేల్చి వేస్తున్నారు. ఈ పేలుళ్ల వల్ల చుట్టుపక్కల ఉన్న బోర్లలో బోర్డర్స్ వచ్చి మోటర్ పైకి కిందికి దిగలేని పరిస్థితిలో ఉందని వేసవికాలం నీటి ఎద్దడి కారణంగా బోరు బావిలో పైపులు దించే అందుకు ప్రయత్నించగా పుంటికూర చిన్న లచ్చమ్మ బోర్లోకి నీరు తగ్గిందని దింపడానికి వెళ్తే బోర్ కిందికి దిగడం లేదని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా అక్రమ పిల్లులను ఆపి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అలాగే విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లో పడకుండా అలా చూడాల్సిన బాధ్యత అధికారుల పైన ఉందన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కేటాయించాలి

- కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు సురభి వినోద

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తనకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ మండలం మహిళా అధ్యక్షురాలు సురభి వినోద అన్నారు. మంగళవారం ఆమె నర్సాపూర్ లో విలేకరులతో మాట్లాడారు గత 20 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని తెలిపారు .కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కొంతమంది నాయకులు వారి స్వార్థం కోసం పార్టీని వీడి ఇతర పార్టీలోకి వెళారని తను మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశానని పార్టీ జెండాను నమ్ముకుంటూ వచ్చానని ఆమె అన్నారు. తను రుస్తుంపేట ఉమ్మడి గ్రామపంచాయతీకి వార్డు సభ్యులుగా నూతనంగా ఏర్పడిన సీతారాంపూర్ గ్రామపంచాయతీకి ఉప సర్పంచ్ గా పనిచేశానని అన్నారు. నర్సాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ జనరల్ అయినందున చైర్మన్ పదవిని తనకు కేటాయించాలని ఆమె కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి మొరపెట్టుకున్నారు.

## వడగండ్ల వానతో అపార నష్టం

నవతెలంగాణ-నిజాంపేట



గత రాత్రి కురిసిన ఈదురుగాలలతో కూడిన వడగండ్ల వాన వల్ల మండల వ్యాప్తంగా వరి పంట, మొక్కజొన్న అపార నష్టం జరిగిందని మండల వ్యవసాయ ఇంచార్జ్ అధికారి రాజ్ నారాయణ అన్నారు. ఆయన ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ నిజాంపేట్, బచ్చురాజ్‌పల్లి, నస్కల్, నందిగామ, కల్వకుంట్ల, నార్లాపూర్, చల్మెడ రెవెన్యూ గ్రామాలకు చెందిన మొక్కజొన్న వరి పంట దెబ్బతిన్నదనీ నిజాంపేట్ మండల వ్యాప్తంగా 1329 ఎకరాల్లో వరి పంట 206 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగినట్లు ప్రాథమిక అంచనా నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందన్నారు. గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు వ్యవసాయ ఏవో టెక్నికల్ సతీష్ కుమార్, విస్తీర్ణాధికారిని కావేరి తదితరులు పాల్గొన్నారు.

## మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిస్తాం

- సీపీఐఎం జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం

నవతెలంగాణ-మెదక్



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగించాలని

సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. మల్లేశం పిలుపునిచ్చారు. మంగళవారం మెదక్ కిషన్ భవన్ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి కామ్రేడ్ మల్లు స్వరాజ్యం జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శమన్నారు. దున్నేవాడికే భూమి కావాలని, వెట్టి చాకిరి విముక్తి కావాలని, మహిళల పై జరుగుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా నిలబడి తుపాకీ బట్టి పోరాడిన యోధురాలు మల్లు స్వరాజ్యం అని తెలిపారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటాకు చేయడం వల్లనే నిజాం నిరంకుశ జాగీర్ దేశముకుల పాలన అంతమైందనన్నారు. మల్లు స్వరాజ్యం తన పదకొండవ ఏట నుంచే ప్రజా ఉద్యమాలలో పాల్గొని తుంగతుర్తికి రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై తన జీవితాంతం వరకు ప్రజల కోసం పోరాడిందన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో పాలకులు మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించడంలో ఘోరంగా విఫలం అవుతున్నట్లు తెలిపారు. ప్రజలు మెరుగైన ఉచిత విద్యా, వైద్యం ఉపాధి కొరకు పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. మల్లు స్వరాజ్యంను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ఆశయ సాధనలో ముందుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, నాయకులు జగన్, అజయ్, సత్యం, రాణి, తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై జీవితం పై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నార్సింగి



మద్యానికి బానిసై జీవితం పై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి పట్టణ కేంద్రంలో జరిగింది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి పట్టణ కేంద్రానికి చెందిన గౌరిగారి శ్రీకాంత్ రెడ్డి (26) తండ్రి గౌరిగారీ సుభాష్ రెడ్డికి గత నాలుగు సంవత్సరాల క్రితం గౌరీగారి రక్షితతో వివాహం జరిగింది. అతనికి ఇద్దరు కూతుళ శ్రీకాంత్ రెడ్డి గత సంవత్సర కాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతూ భార్య ను వేదిస్తుండగా మృతుని భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని తన తల్లి గారి ఇంటి వద్ద ఉంటుంది. శ్రీకాంత్ మద్యం తాగినప్పుడల్లా తరచుగా ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించే వాడని, 18 రాత్రి దాదాపు 11 గంటలకు మద్యం తాగి పక్కింటి వారికి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పి ఇంటిలోపలికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఇరుగు పొరుగు వారు లోపలికి చూసేసరికి శ్రీకాంత్ రెడ్డి ఇంటి దూలానికి వెలాడుతు కనబడ్డాడు. విషయాన్ని శ్రీకాంత్ రెడ్డి భార్యకు తెలపగా ఆమె తన కుటుంబ సభ్యులతో వచ్చి చూడగా తాడుతో ఉరి వేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యుల సహాయం తో వెంటనే రామాయంపేట ఆసుపత్రికి తరలించగా, అక్కడి డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య గౌరీగారి రక్షిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ తెలిపారు.

## ఔషధ రంగంలో బయోలాజికల్‌కు మంచి భవిష్యత్తు

- రెడ్డీస్ ల్యాబ రేటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజశేఖర్

నవతెలంగాణ-నర్సాపూర్



ఔషధ రంగంలో బయోలాజికల్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని రెడ్డీస్ ల్యాబరెటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని విష్ణు ఫార్మసీ కళాశాలలో విద్యార్థుల, అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రెడ్డీస్ ల్యాబ రేటరీస్ వైస్ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్ ,జేఎన్టీయూ కె హెచ్ ఓ డి డాక్టర్ బి భవానిలు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బయోలాజికల్స్ కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాబోయే 20 సంవత్సరాలలో ఔషధ రంగాల్లో బయోలాజికల్స్ డోసేజ్ ఫామ్స్ కు అత్యధిక ప్రాధాన్యత సంతరించుకుంటుందని అన్నారు. ఫార్మా రంగంలో మహిళలకు ఎక్కువగా అవకాశాలు ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆన్లైన్లో పాల్గొని బయోలాజికల్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వై ఫర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ ,కళాశాల హెచ్వోడీలు రాజేంద్రప్రసాద్, కే వనిత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పహీం ,చందన, సూర్యం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్చి 22న నార్సింగి తై బజార్ వేలం

నవతెలంగాణ-నార్సింగి

గ్రామ పంచాయితీలకు ఆదాయం సమకూర్చడంలో తై బజార్‌ది ముఖ్య పాత్ర. ప్రతి సంవత్సరం మార్చి నెలలో తై బజార్ వేలం నిర్వహించి తదుపరి ఏడాది మార్చి వరకు ఎక్కువ మొత్తానికి దక్కించుకున్న వారికి తై బజార్ వసూలు చేసుకునే వీలును కల్పిస్తారు. నార్సింగి పట్టణ కేంద్రంలో 22 మార్చ్ శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయం లో 2024 - 2025 సం కు గాను తై బజార్ వేలం నిర్వహించనున్నట్లు నార్సింగి గ్రామ పంచాయితీ కార్యదర్శి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 50 వేలు దరావత్తు రుసుమును కట్టాలని, వేలం లో తై బజార్ దక్కించుకున్న వారు డిపాజిట్ కలుపుకొని వేలం పాట మొత్తం లో సగం రుసుమును వెంటనే చెల్లించి రసీదు పొందాలని, మిగతా సగం జూలై లో చెల్లించాలని వివరించారు. గత సంవత్సరం 2023 - 2024 లో నిర్ణయించిన ప్రకారమే విక్రేతలు వద్ద వసూలు చేసిన ధరలే తై బజార్ గా వసూలు చేయాలని తెలిపారు. వేలానికి ప్రజాప్రతినిధులు, ఉద్యోగస్తులు, వార్డు సభ్యులు అనర్హులని, వేలం పాట ప్రత్యేక అధికారి ఆనంద్ బాబు అధ్యక్షతన, మండల పంచాయితీ అధికారి సమక్షం నిర్వహించనున్నట్లు కార్యదర్శి వెంకటేష్ తెలిపారు.



## వలలో చిక్కుకుని నీట మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ - నార్సింగి



చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకుని వ్యక్తి మృతి చెందాడు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి గ్రామమైన శంఖా పూర్ గ్రామానికి చెందిన పర్శ బీరయ్య (49) సోమవారం మధ్యాహ్నం గ్రామం లోని మైసమ్మ చెరువుకు మరో వ్యక్తి తో కలిసి చేపల వేటకు వెళ్ళాడు. ప్రమాదవశాత్తు చేపల వేట కోసం వేసిన వలలో చిక్కుకుని నీట మునిగి బీరయ్య మృతి చెందాడు. మృతుని భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని రామాయంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు ఎస్ఐ వెల్లడించారు.

## ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ- నిజాంపేట

మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతు కుటుంబాలను పరామర్శించేందుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పర్యటించనునట్లు మండల అధ్యక్షుడు దాత్రిక మారుతి, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నష్టపోయిన కుటుంబాలకు భరోసా గా నిజాంపేట మండలంలోని పలు గ్రామాలను సందర్శించ నునట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని పిలుపునిచ్చారు.

## తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్




**నవతెలంగాణ -నంగునూరు**

నంగునూరు తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లు పరిశీలించి ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధరణి, తహసిల్దార్ లాగిన్‌లో ఎం ఆప్షన్స్ ఇచ్చారో పరిశీలించారు. దరఖాస్తుల పెండింగ్ వివరాలను తహసీల్దార్ అనిల్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు దాడులు



**నవతెలంగాణ-వర్గల్**

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఎలాంటి ప్రభుత్వ అనుమతులూ లేకుండా గౌరారం మీదుగా అక్రమంగా ఇసుకను హైదరాబాద్ వైపు తరలిస్తుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గౌరారం పోలీసులు వారిని పట్టుకున్నారు. వాహనాలను సీజ్ చేసి దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ.. అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం, రవాణా పేకాట, జూదం, గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు ఎవ్వరి దృష్టికి వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

**నవతెలంగాణ-చేర్యాల**

తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో సమస్యలపై యువత పోరాడాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. అనంతరం ముస్త్యాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం కమ్యూనిస్టు సిద్ధాంతాలను ధృఢంగా నమ్మి 16 ఏండ్ల వయస్సులో ఉద్యమంలోకి వచ్చారన్నారని తెలిపారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సమస్యలపై వాణి వినిపించారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రజా ఉద్యమాల నిర్వహణలో ముఖ్యంగా మహిళలకు స్వరాజ్యం జీవితం ఆదర్శనీయమని తెలిపారు. నాటి డిమాండ్లే నేటికీ అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, జిల్లా కమిటి సభ్యులు బద్దిపడగ కృష్ణా రెడ్డి, బండకింది అరుణ్, పట్టణ నాయకులు ఇప్పకాయల శోభ, రమ, నూర్జీ, లావణ్య, అస్గర్, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

**నవతెలంగాణ-చేర్యాల**

మహిళా లోకానికి దిక్సూచిగా మల్లు స్వరాజ్యం నిలిచారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) చేర్యాల పట్టణ కార్యదర్శి ఇప్పకాయల శోభ అన్నారు. మల్లు స్వరాజ్యం రెండవ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నేటితరం మహిళలు ఆమె అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లావణ్య, లక్ష్మి, భవాని, బాలమణి, నర్సవ్వ, కనకవ్వ, మాధవి, రేణుక, లచ్చవ్వ, సిద్ధవ్వ, విజయ, అలేఖ్య పాల్గొన్నారు.



**నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కష్టజీవులందరిని ఐక్యం చేసి దొరలు, భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా ప్రజా పోరు నడిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. మంగళవారం మల్లు స్వరాజ్యం రెండవ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ ఎర్రజెండానే ఊపిరిగా పీడిత ప్రజల విముక్తే ధ్యేయంగా ఎత్తిన జెండా విడవకుండా చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప వీరనారి మల్లు స్వరాజ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్, జాలిగపు శిరీష, నాయకులు కొండం సంజీవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

**నవతెలంగాణ- దుబ్బాక**

వీర తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం చూపిన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శనీయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.భాస్కర్ అన్నారు. మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో మల్లు స్వరాజ్యం రెండో వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళుర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.భాస్కర్ మాట్లాడుతూ.... మల్లు స్వరాజ్యం ప్రజలకొరకే జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలని అన్నారు. దేశంలో బీజేపీ సర్కారు కొనసాగిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొంపల్లి భాస్కర్, రాజు, మల్లేశం, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



**నవతెలంగాణ - మెదక్ డెస్క్**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యమని ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తినిశారద అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మల్లు స్వరాజ్యం రెండవ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు దొరల గడీలను బద్దలు కొట్టి బందూకులెత్తించిన విప్లవ వీరనారి మల్లు స్వరాజ్యం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, తాజా మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, మత్స్య సంఘం జిల్లా కార్యదర్శి తేలు ఇస్తారి, మండల నాయకులు తాడూరి మల్లేశం, భరత్ ,నరేష్ ,మల్లవ్వ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.






## కరెన్సీ నోట్స్ ధ్వర బాక్టీరియా వ్యాప్తిపై పరిశోధన

**నవతెలంగాణ-సిద్దిపేట**

కరెన్సీ నోట్స్ ధ్వర బాక్టీరియా వ్యాప్తిపై తమ విద్యార్థులు పరిశోధన చేసినట్లు జీవసాంకేతిక శాస్త్ర సహాయ ఆచార్యులు, విభాగాధిపతి డా. జి. మదన్ మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ చదువుతున్న విద్యార్థులు ఎ.రమ్య, కె. గాయత్రి, డి.శ్రీనిఖిత, ఆర్. అఖిల్ కుమార్ , యస్. పూజిత, కె. మౌనిక కరెన్సీ నోట్ల ద్వారా బ్యాక్టీరియాల వ్యాప్తిపై పరిశోధన చేశారని తెలిపారు. ఈ పరిశోధన రాష్ట్ర స్థాయిలో ఎంపిక అవడం సంతోషంగా ఉందన్నారు. మనం నిత్యం వాడే కరెన్సీ నోట్లు కొన్ని సందర్భాల్లో అనారోగ్యానికి కారణం అవుతాయనీ, జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందేనని తెలిపారు. కళాశాలలో బోధనా సిబ్బంది, విద్యార్థులు, రైతుబజారులో రైతులు, వినియోగదారులు, ఆసుపత్రుల్లో రోగుల సహాయకులు, ప్రయాణ ప్రాంగణంలో కండక్టర్లు, బ్యాంకులు, హోటళ్లు, దుకాణా సముదాయాల్లో వినియోగదారుల కరెన్సీనోట్ల నుంచి స్వాబ్ సేకరించారనీ, మొత్తం 96 నమూ నాలు తీసుకొని యానకంలో ప్రవేశపెట్టి బ్యాక్టీ రియాలను వెలికితీశారనీ, నమూనాల సేకరణకు 30 రోజులు, ఫలితాల నిర్ధారణకు 15 రోజులు పట్టిందనీ తెలిపారు. రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రదర్శనకు సిద్ధమవుతున్నారనీ అన్నారు. కరెన్సీ నోట్ల ద్వారా డయేరియా, గొంతు సంబంధిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందనీ, ఏడు రకాల రోగాలను గుర్తించారనీ తెలిపారు. ప్రధానంగా కరెన్సీ నోట్లను లెక్కించే క్రమంలో నోటిలోని తడిని వాడటం కారణంగా బ్యాక్టీరియాలు శరీరంలోకి ప్రవేశి స్తాయనీ, హోటళ్లలో టిఫిన్ చేసే ముందు చేతులు శుభ్రం చేసుకొని టోకెన్ తీసుకుంటారనీ, ఈ క్రమంలో డబ్బులు చేతులు మారుతుందనీ, ఆ తర్వాత నేరుగా అల్పాహారం తినడం వల్ల బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్తుందనీ, డబ్బు మారేప్పుడు లెక్కించిన తర్వాత చేతుల శుభ్రత తప్పనిసరి చేసుకోవాలని, నగదు రహిత (ఆన్లైన్) లావాదేవీలు చేయడం ఉత్తమమని తెలిపారు. ఈ పరిశోధన అంశం రాష్ట్రస్థాయికి ఎంపిక అవడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి హెచ్. ప్రసాద్ , వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనమ్ , ఐ క్యు ఏసి సమన్వయకర్త డాక్టర్ సి హెచ్ .మధుసూదన్ , డాక్టర్ అయోధ్య రెడ్డి , జిజ్ఞాస కోఆర్డినేటర్ డా.పి. పల్లవి, డాక్టర్ రాణి , డాక్టర్ శైలజ , డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి , డాక్టర్ మహేశ్, విశ్వనాథం , మెరాజ్ ఫాతిమా, మరియు కళాశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.



## ప్రాజెక్ట్ నివేదికల తయారీపై కార్యశాల

**నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్**

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని, వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బీ.కాం విద్యార్థులందరికీ ప్రాజెక్టుల నివేదికల తయారీపై ఒకరోజు కార్యశాలను నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వి.ఉమాశశి అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ, పీ.జి కళాశాల అటానమస్ వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గోపాల సుదర్శనం కీలకోపన్యాసం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో ప్రాజెక్టుల తయారీ ఒక ముఖ్య విషయంగా ఉండడం విద్యార్థుల భవిష్యత్ కార్యాచరణకు ఎంతో ఉపయుక్తమన్నారు. వారిలో ఒక అంశాన్ని లోతుగా అధ్యయనం చేయడం, సూక్ష్మ పరిశీలన, పరిశోధన దృక్పథం అలవర్చుకోవడం మంచిదన్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించడం వాటికి సముచితమైన పరిష్కారాలను అన్వేషించడం లాంటి అనేకమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది అని అన్నారు. విద్యార్థులు అనుభవజ్ఞులు అయిన ఆచార్యుల పర్యవేక్షణలో ఈ నివేదికలను తయారు చేస్తారన్నారు. కాబట్టి భవిష్యత్‌లో మరిన్ని నిర్మాణాత్మకమైన పరిశోధనలను చేపట్టేందుకు ఇవి ఆధారంగా వుంటాయన్నారు. ప్రాజెక్ట్ అంశాలను ఎన్నుకునేటప్పుడు, తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు వుంటాయని వారు సూచించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంలో విషయ పరిజ్ఞానం, భాష నైపుణ్యం, సాంకేతిక సాధనాల వినియోగం, పరిశోధన మెళకువలు క్రియాశీల పాత్రను పోషిస్తాయన్నారు. వాటిని నిత్యం మెరుగుపరుచుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు.



ప్రాజెక్టుల తయారీ అనేది 6వ సెమిస్టర్‌లో నాలుగు క్రెడిట్లతో తప్పనిసరిగా చదవలసిన విషయమన్నారు. భవిష్యత్‌లో ఉద్యోగాల ఇంటర్వ్యూలలో ప్రాజెక్టుల ఆధారిత మదింపు ఉంటుందని అన్నారు. కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ఏ. బాలచంద్రం అధ్యక్షతన జరిగిందన్నారు. కామర్స్ విభాగం వారు విద్యార్థి కేంద్రంగా కార్యక్రమాల నిర్వాహణలో ఎప్పుడు ముందు ఉంటారన్నారు. వారిని అభినందిస్తూ, ఇలాంటి కార్యశాలలు పరిశోధనా రంగంలో వస్తున్న ఫలాలను అందిపుచ్చుకోవడానికి సహాయకారిగా వుంటాయన్నారు. కార్యశాల ఉపన్యాసకులు బాలచంద్రం అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ, కార్యశాల ముఖ్య ఉద్దేశ్యాలు, లక్ష్యాలు, చర్చించే అంశాలను తెలియజేశారన్నారు. ప్రాజెక్టుల తయారీకి పరిశోధనా అంశాల గుర్తింపు, వాటి లక్షణాలు, పరిశోధనా పద్ధతులు, ఫలితాలు విశ్లేషించే విధానాలు తెలిపారన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు సరోజన, నరేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## వందశాతం పన్నులు వసూలు చేయాలి

- కమిషనర్ గోల్కొండ నరసయ్య

**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 2023-24 కు సంబంధించిన ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్లో అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31 లోపు పూర్తిస్థాయిలో పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని పన్నులు, వ్యాపారస్తులు ఆస్తి పనులు చెల్లించాలన్నారు. ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి ఇంటి యజమానులు వ్యాపారులు పూర్తిస్థాయిలో సహకరించి పన్నులు చెల్లించాలన్నారు. అదేవిధంగా పాండవుల చెరువు ను ఆయన పరిశీలించారు.



పాండవుల చెరువు వద్దకు వచ్చే వారందరికీ సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆట వస్తువులు, ఎలక్ట్రికల్ ట్రైన్, పడవలు తదితర వాటిని కమిషనర్ పరిశీలించారు.

## ఉపాధి హామీ నర్సరీ పనులను పరిశీలించిన ఎంపీడీవో

**నవతెలంగాణ-మద్దూరు**

దూల్మిట్ట మండలంలోని కొండాపూర్, దుబ్బతండ, హనుమతండ, రెడ్యానాయక్ తండ, కూటిగల్, గ్రామాలలో ఉపాధి హామీ పనులను నర్సరీలను, ఎంపీడీవో రామ్మోహన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు ఉదయం పూట వచ్చే పనులు ముగించుకోవాలని ఆయన కోరారు. వచ్చే హరితహారం నాటికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రభుత్వ భవనాలపై ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు, గోడలపై రాతలు ఉన్న వెంటనే తీసివేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నర్మెట పాఠశాలలో ఘనంగా ఎస్ఐవి గ్రాడ్యుయేషన్ డే

**నవతెలంగాణ -నంగునూరు**

నంగునూరు మండలం నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం దేశపాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, ఎస్ఐవి క్లస్టర్ పరిశీలకుడు సంతోష్ కుమార్, శిల్ప, చంద్రకళ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆంగ్ల భాష పై పట్టు సాధించి భవిష్యత్తులో ఎదగడానికి దేశ్ పాండే ఫౌండేషన్ గత నాలుగు సంవత్సరాలుగా పేద విద్యార్థులకు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. నార్లపురం శ్రీనివాస్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నర్మెట పాఠశాలలో ఉపాధ్యాయులు మంచి నాణ్యమైన విద్యను అందించడం, ఆంగ్లంలో మాట్లాడటం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, గణపతి, కనకయ్య, ఆనంద్ రెడ్డి, గఫూర్, లలిత, రాజ్ కుమార్, స్కిల్ ఇన్ విలేజ్ క్లస్టర్ హెడ్ సంతోష్ కుమార్, క్లస్టర్ ట్రైనర్ అనుపమ, క్లస్టర్ అసోసియేట్ సాయి కిరణ్, సెంటర్ టీచర్లు శిల్ప, చంద్రకళ, ఎస్ఐవి టీచర్లు గంధమల్ల యాదగిరి , రవళి, భాను ప్రసాద్, రుక్మిణి, మానస, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## వేతనాలు అందక పంచాయితీ కార్మికులు అవస్థలు

- తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్

**నవతెలంగాణ-సిద్ది పేటరూరల్**

వేతనాలు అందక గ్రామపంచాయతీ కార్మికులు అవస్థలు పడుతున్నారని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్ అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మిక హక్కులను హరించే మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దుచేసి.. పంచాయితీ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు గత ఐదు నెలల నుండి వేతనాలు అందక గ్రామపంచాయతీ ఉద్యోగులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మల్టీపర్పస్ వర్కర్ విధానంతో ఉద్యోగ భద్రత కోల్పోయారని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 9,500 వేతన చట్టం అందరికీ అందడం లేదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఐదు నుండి ఏడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని అన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేసి ఆదివారం, పండుగ సెలవులను కూడా పంచాయతీ కార్మికులందరికీ వర్తింపజేయాలని కార్మికులు చనిపోతే దహన ఖర్చుల నిమిత్తం రూ. 20 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 21న కార్మికుల సమస్యలపై చలో పంచాయితీ రాజ్ కమిషనర్ కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమాన్ని పంచాయితీ కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.





## పంటలకు సాగునీరు అందించాలి

- డిఎస్పీ జిల్లా అధ్యక్షులు రవిబాబు

**నవతెలంగాణ-అక్కన్నపేట**

అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి రిజర్వాయర్ ను త్వరగా పూర్తిచేసి, చుట్టుప్రక్కల గ్రామాల్లోని పంటలకు వెంటనే సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రవిబాబు అన్నారు. మంగళవారం మండల నాయకులతో కలసి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక ఎండల వల్ల బావుల్లో, బోర్లలో నీరు అడుగంటి పంటలు ఎండుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయి ఉంటే ఈ సమస్య వచ్చి ఉండేది కాదని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గౌరవెల్లి రిజర్వాయర్ లోకి నీటిని పంపిణీ చేసి, కాలువల ద్వారా పంటలకు సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సదన్ మహరాజ్, అక్కన్నపేట మండల అధ్యక్షులు సతీష్ , సురేషు, యాదగిరి పాల్గొన్నారు.



## అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం విజయవంతం

**నవతెలంగాణ-దౌల్తాబాద్**

మండల పరిధిలోని శేర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి 51 మంది మహిళలు హాజరయ్యారు . పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థుల బాగోగుల కోసం ఈ అమ్మ ఆదర్శ కమిటీలు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. తల్లితండ్రుల పూర్తి సహకారంతోనే ఈ పాఠశాల అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. కమిటీలో సెర్ప్ మహిళా విభాగం సభ్యుల సహకారంతో పాఠశాల అభివృద్ధి కొనసాగించడం జరుగుతుందన్నారు.

### శేరుపల్లి అమ్మ ఆదర్శన కమిటీ ఏర్పాటు

శేరుపల్లి ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గా సంధ సుజాత పాఠశాల కన్వీనర్ గా విష్ణువర్ధన్ రెడ్డి సభ్యులుగా బి లక్ష్మి ఎం నిత్య ,జె లావణ్య, శ్యామల, ఎం మానస, సభ్యులుగా బి. లక్ష్మి, నిత్య , శ్యామల,. మానస,, ఫర్హత్ పెనుమండ్ల రూప పెరిమల రూప, డాకొల్ల లావణ్య పుష్ప జై కవిత, పి నవ్య తోపాటు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**నవతెలంగాణ-మర్కుక్**

మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన దేవి శంకయ్య (44) సోమవారం రాత్రి మృతి చెందాడు. మర్కుక్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి రూ.5వేలు ,మర్కుక్ మాజీ సర్పంచ్ భాస్కర్ కు ఇవ్వగా ,బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు . గంగాపూర్ - యూసఫ్ ఖాన్ పల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు జె.శ్రీనివాస్, బాలరాజు , తదితరులున్నారు.

## చర్చి సమస్యలను పరిష్కరించాలి



**నవతెలంగాణ-సిద్దిపేట:** రాముని పట్లలోని సిఎస్ఐ చర్చికి నీటి సదుపాయం, బోరు, కాంపౌండ్ వాల్ ఏర్పాటుచేయాలని చర్చి ఫాదర్ ఆంథోని తనను కోరినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ క్యాంప్ కార్యాలయంలో కలిసి సమస్యలను విన్నవించారని, త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాముని పట్ల చర్చ్ ఫాథర్ దినేష్, గ్రామస్తులు రత్నయ్య, శంకర్, దేవదనం, జీవరథనం, మధు, పోచయ్య, అభిరామ్, పాల్గొన్నారు.ల

## రెండోరోజు ప్రశాంతంగా పది పరీక్ష

**నవతెలంగాణ-న్యాల్‌కల్**

మండలంలోని మెటల్‌కుంట, హద్నూర్, న్యాల్‌కల్‌లో గల పరీక్ష కేంద్రాల్లో రెండోరోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగింది. 389 విద్యార్థులుగాను 388 మంది విద్యార్థులు హాజరు కాగా.. ఒక విద్యార్థి గైర్హాజరైనట్టు ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద హద్నూర్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతతో 144 సెక్షన్ విధించారు.

## నంగునూరు మండల నిధులు కోసం వినతి

**నవతెలంగాణ -నంగునూరు**

నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి నిధుల కోసం మంగళవారం సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణకు నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తప్పెట శంకర్ వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా తప్పెట శంకర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం అభివృద్ధి కోసం ఇంచార్జి మంత్రి ద్వారా ప్రతి గ్రామానికి పత్యేకంగా నియోజకవర్గం ఇంచార్జిల ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు గ్రామలను అభివృద్ధి చేయాలని రాత పూర్వకంగా అందజేశానన్నారు.

## కోటి తలంబ్రాల దీక్ష అద్భుతం

**ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి**

**నవతెలంగాణ-గజ్వేల్**

శ్రీరామకోటి భక్త సమాజం నిర్వహిస్తున్న కోటి తలంబ్రాల దీక్షలలో మంగళవారం ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డికి తలంబ్రాలు అందజేశారు. సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు . ఆ తలంబ్రాలను ఎమ్మెల్సీ రామనామాన్ని స్మరిస్తూ గోటితో ఒడ్లు ఒలిచి తలంబ్రాలుగా చేసి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ భద్రాచల శ్రీరాముని కల్యాణానికి గజ్వేల్ లోని శ్రీరామకోటి భక్త సమాజానికి ఇలాంటి అద్భుత ఆవకాశం దక్కడం రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక కృషి, పట్టుదలే కారణం అన్నారు.

## ఎంపీఓపై దాడికి నిరసనగా మండల పరిషత్ ఉద్యోగులు నిరసన

**నవతెలంగాణ-మద్దూరు**

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు ఎంపీఓ శ్రావణ్‌కుమార్‌పై జరిగిన దాడికి నిరసనగా మద్దూరు మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామ్ మోహన్ మాట్లాడుతూ..ఎంపీ ఓ శ్రావణ్ కుమార్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాజా మొయినద్దీన్, ఏపీవో పరశురాం, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## విజయ డైరీ చైర్మన్ గా బద్దిపడగ నరసింహారెడ్డి

**నవతెలంగాణ-మిరు దొడ్డి**

విజయ డైరీ పాలకవర్గ సమావేశంలో నూతన చైర్మన్‌ను కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని విజయ డైరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన చైర్మన్ గా బద్దిపడగ నరసింహారెడ్డి, డైరెక్టర్లుగా 15 మందిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ, పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పాల బిల్లులు త్వరగా చెల్లించే విధంగా చొరవ చూపాలని కోరారు.

## మృతుడి కుటుంబానికి అర్థికసాయం

**బిజెపి మండలాధ్యక్షులు రాంరెడ్డి**

**నవతెలంగాణ-మర్కుక్**

మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన దేవి శంకరయ్య (48) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం ఈ విషయం తెలుసుకున్న బిజెపి మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల అర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో బిజెపి నాయకులు రాజేందర్ సింగ్,సుర్వీ కృష్ణమూర్తి, కుశల్ సింగ్, పాపోల్ల కొండల్, తదితరులున్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన

**నవతెలంగాణ-న్యాల్‌కల్**

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామ శివారులో జహీరాబాద్-బీదర్ ప్రధాన రోడ్డులో రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్లు తొలగించలేదు. దాంతో కోడ్ ఉల్లంఘన జరుగుతున్నదని.. ఎంపీడీవో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని పలువురు మండిపడుతున్నారు. ఎట్టి పరిస్థి తుల్లోనూ కోడ్ ఉల్లంఘన జరగొద్దని ఎన్నికల అధికారులు చెబుతున్నప్పటికీ.. స్థానిక అధికా ర యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించడాన్ని తప్పుబడుతున్నారు.

## ఎలక్ట్రిక్ బైకులో చెలరేగిన మంటలు

**నవతెలంగాణ-సిద్దిపేట**

పట్టణంలోని మోడ్రన్ బస్టాండ్ వద్ద ఓ ఎలక్ట్రికల్ బైక్ లో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఎలక్ట్రికల్ బైక్‌పై బస్టాండ్ వద్దకు వచ్చాడు. బస్టాండ్ వద్ద పార్కు చేయగా.. ఒక్కసారిగా మంటలు చిలరేగి పొగ వ్యాపించింది, అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమై నీళ్లతో మంటలను ఆర్పేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# మాకు ... మా రోడ్లకు... రక్షణ కల్పించాలి

**నవతెలంగాణ-సిద్ది పేట**



ప్రభుత్వం ఇచ్చిన జి ఓ నంబర్ 58 , 59 ప్రకారం స్థానిక ప్రజల అవసరాలు కోసం వాడుకుంటున్న రోడ్ ను కొందరు మూసివేసారని, ఈ విషయంలో మాకు మా రోడ్లకు రక్షణ కల్పించాలని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో వినతిపత్రం అందించినట్లు హౌసింగ్ బోర్డు కాలనీ జగజీవన్ రాం భవన్ సమీపలో ఉన్న 32 కుటుంబాలకు చెందిన వారు తెలిపారు. బాధితులు మాట్లాడుతూ 10 సంవత్సరాల తర్వాత అంబేద్కర్ నగర్ కు సంబందించిన కొందరు ప్రభుత్వం కేటాయించిన రోడ్ లో సిమెంట్ ఇటుకలతో అక్రమంగా ఇండ్ల నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారనీ, ప్రజలను ఇబ్బంది పెట్టేలా కడీలు పాతుతున్నారనీ, ఇదేంటని ప్రశ్నిస్తే ఎస్సీ ఎస్టీ , ఇతర అక్రమ కేసులు పెట్టి స్థానికులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారనీ తెలిపారు. పోలీసులు వాస్తవాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మాకు, మా రోడ్లకు రక్షణ కల్పించాలని తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఏసీపీ ,యస్ ఐ నీ కలిసి తమ బాధను వెల్లడించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు ఇరుగడిండ్ల తిరుపతి, స్వామి, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రాము, రాజిరెడ్డి, మైసయ్య, తిరుపతి గౌడ్, రాములు గౌడ్, గణపతి , నర్సయ్య, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

# రఘునందన్ రావును కలిసిన బీజేపీ నాయకులు

**నవతెలంగాణ- నర్సాపూర్**

మెదక్ బీజేపీ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావును మంగళవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీకి చెందిన అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుత రఘునందన్ రావు బిజెపి పార్టీ తరవున మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా ఉన్నందున ఆయన గెలుపు కోసం కృషి చేస్తామని మెదక్ గడ్డపై కాషాయం జెండా ఎగరవేస్తామన్న ధీమా ను వారు వ్యక్తం చేశారు. రఘునందన్ రావు ను కలిసిన వారిలో బిజెపి నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ,హత్నూర మండల బిజెపి అధ్యక్షులు నాగ ప్రభు గౌడ్, నర్సాపూర్ మండలం బిజెపి అధ్యక్షులు నీలి నాగేష్ ,కొల్చారం మండల అధ్యక్షులు దయాకర్ గౌడ్ ,శివంపేట మండల అధ్యక్షులు రవి ,చిలిపిచెడ్ మండల అధ్యక్షులు రాకేష్ తోపాటు నాయకులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి

- **ప్రభుత్వం అదుకోవాలని రైతు వేడుకోలు**

**నవతెలంగాణ-మర్కుక్:** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి నర్సయ్య ఎద్దు మంగళవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుద్ఘాతంతో మతి చెందింది. ఎద్దులతో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న తమకు కాడేద్దు మృతి చెందటంతో రూ. 80 వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. తమను ప్రభుత్వం అందుకోవాలని ఆయన కోరారు.

# రహదారి వెడల్పు పనుల్లో తీవ్ర జాప్యం

**నవతెలంగాణ-గుమ్మడిదల**

మండలంలోని కానుకుంట ప్రధాన రహదారి వెడల్పు పనులు ప్రారంభించి సుమారు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. నాడు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించిన రోజు.. ఆ శాఖ అధికారులతో రెండు నెలల్లో రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అంతలోనే శాసనసభ ఎన్నికలు రావడంతో ఆ పనులను నిలిపివేశారు. ఎన్నికల అనంతరం ఏర్పాటుచేసిన జనరల్ బాడీ సర్వసభ్య సమావేశంలో.. రోడ్డు వెడల్పు పనులు వెంటనే ప్రారంభించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేసినప్పటికీ.. ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని స్థానికులు మండిపడుతున్నారు. కాగా ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో పనులు మరింతలాలస్యయం జరుగుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారరు. శాసనసభ ఎన్నికల అనంతరం శరవేగంగా ప్రారంభించినట్లయితే ఇప్పటివరకు పూర్తయ్యేవని చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కంకర వేసి వదిలిపెట్టడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పటాన్చెరు నియోజకవర్గం శాసనసభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## కిచ్చన్నపల్లిలో వైభవంగా శ్రీ వెంకట్వేర స్వామి కళ్యాణోత్సవం

**నవతెలంగాణ-జోగిపేట**

మండల పరిధిలోని కిచ్చన్నపల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంబమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహొత్సవం అలయ అర్చకులు లక్ష్మణ చారి బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించారు. భక్తులకు బోజన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎం.మల్లిఖార్జున్ దంపతులు, మాజీ ఎంపీపీ రామ గౌడ్, రాంసాని పల్లి మాజీ సర్పంచ్ జోగిరెడ్డి, మెడికల్ షాప్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యెదిరె రమేశ్ దంపతులుతో పాటు నాయకులు చాపల వెంకటేశం, పత్తి వీరేశం, శ్రీనివాస్ రెడ్డి, ఆకుల యాదగిరి, శివకుమార్, నర్సింలు, వెల్డింగ్ మాణయ్య, మహంకాళి ప్రభాకర్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి దేవాలయ హుండీ లెక్కింపు

**నవతెలంగాణ-గుమ్మడిదల**



గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి దేవాలయం ఉండి లెక్కింపును ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆలయ నిర్వహణ అధికారి పి.శశిధర్‌లు.. జిల్లా ఉన్న దేవాదాయ తాధికారుల ఆదేశానుసారం రాజరాజేశ్వరి కామారెడ్డి వారి బృందంతో మంగళవారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.13,12,268 వచ్చినట్టు వారు తెలిపారు. అన్నదాన సత్రం ఆదాయం రూ.70,055 వచ్చినట్లు ఆలయ నిర్వహణ అధికారి పి.శశిధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నబోయిన వేణు, డి.కుమార్, యాదగిరి, మాజీ ధర్మకర్త లక్ష్మి నారాయణ, దేవాలయ అర్చకులు శివనాగులు, సిబ్బంది సోమయ్య, రవీంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ నాయకుల్లో ఆందోళన

**నవతెలంగాణ-గుమ్మడిద:** మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకుల్లో వారి రాజకీయ భవిష్యత్ కోసం ఆందోళన మొదలైంది. దాంతో జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరడానికి ఎవరికి వారే ప్రణాళికలు రచించుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. రానున్న పార్లమెంట్ ఎన్నికలలోపు మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యే అవకాశాలు ఉన్నాయని పెద్ద ఎత్తున గుసగుసలు నడుస్తున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకులతో మండల బీఆర్ఎస్ నాయకులు టచ్‌లో ఉంటున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతన్నాయి. పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గెలుపు కోసం అహర్నిషలు కష్టపడిన తమను పట్టించుకోవడం లేదంటూ పలువురు మండల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు రాజక ీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమైనట్టు విశ్వసనీయంగా తెలిసింది.

## రెడ్డి సంఘూల ఐక్యవేధిక

- రాష్ట్రయూత్ వర్కింగ్
- ప్రెసిడెంట్ గా గోవర్ధన్ రెడ్డి

**నవ తెలంగాణ - కొండపాక:** కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కూరెళ్ళ గోవర్ధన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘాల ఐక్యవేదిక స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, యువత విభాగం అధ్యక్షుడు ఎలిమినేటి సుమన్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అగ్రవర్ణాల్లో ఉన్న పేదల సంక్షేమం కోసం తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తనకు పదవి ఇచ్చిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## చేగుంట తై బజారు వేలంపాట వాయిదా

**నవతెలంగాణ-చేగుంట:** చేగుంట గ్రామపంచాయతీ సంబంధించి 2024 - 25 సంవత్సరానికి తైబజార్ బహిరంగ వేలం పాట పంచాయతీ ఈవో నాగభూషణం, ప్రత్యేక అధికారి గియాస్ ఉన్నిసాబేగం ఆధ్వర్యంలో మంగళవారం వేలంపాట నిర్వహించారు. గుత్తేదారులు నలుగురు పాల్గొని రూ, 50,000 డిపాజిట్ చేసి వేలం పాట పాడారు. వేలంపాట రూ,15, లక్షల 35 వేలకు పాడగా పోయిన సంవత్సరం కంటే తక్కువగా వేలంపాట పోవడంతో వాయిదా వేస్తున్నట్టు నాగభూషణం తెలిపారు. అంతకుముందు కొంతమంది రైతులు మాట్లాడుతూ మార్కెట్ వేలంపాటలో పాడుకున్న గుత్తేదారులు ఎవరైనా కూరగాయల బాక్సుల్లో నుండి ముట్టి తీయకూడదని, ఒకవేళ తీస్తే నూటికి పది రూపాయల కమిషన్ తీసుకోవద్దని, అలాగే అమాలీలను ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న రైతులకు నీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్ దోపిడికి గురికాకుండా నియమ నిబంధనలు పాటించి రైతులకు సమన్వయంతో సహకరించాలని కొంతమంది రైతులు అన్నారు. సంతలో అమ్ముకునే కూరగాయల వ్యాపారస్తులకు ధరల పట్టిక సూచనల మేరకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. కచ్చితంగా అమలుపరుస్తామని, అలాగే ఈ వేలంపాట బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఈవో నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, లింగం, రైతులు, వ్యాపారస్తులు, పాల్గొన్నారు.

## డ్రయినేజీ పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మెన్

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం:** బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని 7వ వార్డ్‌లో జరుగుతున్న అండర్ డ్రయినేజీ పొప్‌లైన్ పనులను మున్సిపాల్టీ చైర్మెన్ కొలను రోజా బాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. పనులలో నాణ్యత పాటించాలన్నారు. లేని యెడల చర్యలు తీసుకోవాల్సి వస్తాదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ ఎం సతీష్ ముదిరాజ్, వీరారెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.